## క్లుప్తంగా

### పాన్‌గల్‌లో 22.09 మి.మీ వర్షపాతం

పాన్‌గల్: మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షంతో మెట్ట పంటలకు కొంత వరకు ఊరట లభించింది. దాదాపుగా నెల రోజుల తర్వాత వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో 22.09 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ అశోక్ పేర్కొన్నారు.

### రాత్రి వేళల్లో పాముల భయం



పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని ముంపుగ్రామం నాగరాలలో రాత్రి సమయంలో పాములతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వాయర్ ఏర్పాటుతో గ్రామాన్ని తరలించగా ఇంకా 58 కుటుంబాలు అక్కడే నివసిస్తున్నాయి. రంగసముద్రం జలాశయంలోకి నీళ్లు వదులు తుండడంతో నీటిలోంచి విషసర్పాలు గ్రామంలోకి వస్తున్నాయి. రాత్రి వేళల్లో పాముల వల్ల గ్రామస్తులు బయటికి రావాలంటనే భయపడుతున్నారు.

### ఉచిత వైద్యశిబిరం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మహబూబ్‌నగర్‌కు చెందిన డాక్టర్ వివేక్‌సాగర్ పల్లెపాగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ వ్యాముల్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పిటల్ చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణ, మార్కెటింగ్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 10వ ఉచిత వైద్య శిబిరం ఖిల్లాఘనపురం లో నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో ప్రజలకు లీవర్ సమస్యలు, అన్నావాహిక, పసిరికలు, క్యాన్సర్, కడుపులో నీరు సమస్య తదితర సమస్యల ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

### లోతట్టు ప్రాంతాల పరిశీలన



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరుకుంది. దీంతో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ 30వ వార్డులోని సాయినగర్, జంగిడిపురం కాలనీల్లో ఇండ్ల మధ్య చేరిన వర్షం నీటిని పరిశీలించారు. వరద నీటిని జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ నిర్మాణం లేకపోవడంతో చిన్న వర్షాలకు కాలనీల్లో ఇళ్ల మధ్య నీరు చేరుతుందన్నారు. కాలువ నిర్మాణం కోసం కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా చూస్తానని ఆయన తెలిపారు.

### సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఎస్‌కేఎం జిల్లా నాయకులు వెంకటేష్, రాబర్ట్, రాజన్నలు అన్నారు. జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో రైతు సమస్యలపై సోమవారం నిర్వహించే జిల్లా సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా రైతు సదస్సుకు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ దేశ వ్యాప్తంగా 570 సంఘాలతో ఎస్‌కేఎం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దిన్ని రాష్ట్ర,జిల్లా స్థాయిలలో వ్యాప్తి చేయ్యడానికి వీలుగా రైతు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో అజయ్ ప్రసాద్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో గుమ్మడం కిష్టమ్మ శనివారం మృతి చెందింది. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. పెద్దమందడి ఎంపీపీ మేగారెడ్డి పంపించిన రూ.5వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, జె ఆశన్న, బోయ వెంకటయ్య, రాముడు, గోవిందు, భాస్కర్, కురుమూర్తి, భానుచందర్ పాల్గొన్నారు.

# తెరుచుకోని గ్రంథాలయం

- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



పట్టణంలో మూతపడిన గ్రంథాలయం

అమరచింత: పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా గ్రంథాలయం తలుపులు మూసుకొనే ఉన్నాయి. దీని గురించి సంబంధిత అధికారులు కాని, ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకోలేదు. దీంతో గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, గ్రంథాలు చదలు పడుతున్నాయి. మండలం ఏర్పడక ముందు అమరచింతలో శాఖ గ్రంథాలయాన్ని నిత్యం తెరిచి ఉంచేవారు. పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. ఎప్పుడైతే మండలం ఏర్పడిందో అప్పటి నుంచి గ్రంథాలయ నిర్వాహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి పెట్టడం లేదు. దీంతో ఇప్పటికీ గ్రంథాలయం తలుపులు మూసుకోనే దర్శనమిస్తున్నాయి. గతంలో కొంత మంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు సహకరించి, చందాలువేసి గ్రంథాలయాన్ని నడిపించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి గ్రంథాలయ బిల్డింగ్ కిరాయి, నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంత కాలానికి భారం పెరగడంతో వెనక్కి తగ్గారు. గత నాలుగేళ్లుగా గ్రంథాలయం మూతపడే ఉంది. మున్సిపాలిటీ అయితే గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని పాఠకులు ఆశపడ్డారు. కానీ గ్రంథాలయాన్ని పట్టించుకోకపోవడంతో వారికి నిరాశే మిగిలింది.

### మూడేళ్లుగా నిర్వహణ చెల్లింపులు..

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూళ్లలో ఏడు శాతం వాటను జిల్లా గ్రంథాలయ సంస్థకు కేటాయిస్తున్నారు. మూడేళ్లుగా రూ.15 వేలు, రూ.45 వేలు, రూ.92 వేలు మున్సిపాలిటీ ద్వారా చెల్లిస్తున్నారు. ఈ ఏడాది రూ.2.30లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా నిర్వహణ అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం కనీసం దినపత్రికలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూత పడిన గ్రంథాలయాన్ని తెరిపించాలని యువకులు, పాఠకులు కోరుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం..



పట్టణంలో ఎన్నో ఏళ్లుగా గ్రంథాలయం మూతపడింది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ద్వారా డబ్బులు తీసుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ పట్టణంలో ఉన్న గ్రంథాలయాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– తౌఫిక్, అమరచింత

### నిర్వహణ చెల్లిస్తున్నాం..



పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ ఉంది. వాటికోసం జిల్లా గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నిర్వహణ నిధులు చెల్లిస్తున్నాం. ఉన్నతాధికారులకు సమస్యను చెప్పి గ్రంథాలయాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

## మంత్రికి స్వాగతం పలికిన నాయకులు



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

వనపర్తిటౌన్: అమెరికాలో అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పర్యటన పూర్తి చేసుకొని ఆదివారం రాత్రి పట్టణానికి తిరుగొచ్చిన మంత్రి నిరంజన్‌రెడ్డికి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ స్వాగతం పలికారు. ఈ మేరకు మంత్రిని శాలువాతో సన్మానించి, మొక్కను అందజేశారు. రైతంగానికి మేలు చేసే పరిశోధన కేంద్రాన్ని మంత్రి పర్యటించాడని, పర్యాటన ఫలాలు వెంటనే తెలంగాణ రాష్ట్ర రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, మైనార్టీ అధ్యక్షుడు జోహెబ్, గంధం చింటు, కార్తీక్, శేఖర్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను విస్మరిస్తే ఓటమి తప్పదు



ముదిరాజ్ చైతన్య వేదిక నాయకులతో కొత్తకోట ముదిరాజ్ సంఘం నాయకులు

కొత్తకోట: రాష్ట్రంలోని ముదిరాజ్‌లను విస్మరిస్తే అధికార, ప్రతిపక్ష నాయకులకు ఓటమి తప్పదని ముదిరాజ్ సంఘం నాయకులు హెచ్చరించారు. ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర ఆదివారం కొత్తకోటకు చేరుకుంది. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కొత్తకోట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 119నియోజవర్గాల్లో ముదిరాజ్‌లను చైతన్యం చేసేందుకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. జనాభా దమాషా ప్రకారం ప్రతి రాజకీయ పార్టీ ముదిరాజ్‌లకు 15సీట్లు కేటాయించాలన్నారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అన్ని పార్టీల వారు ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వాకిటి రాజమౌళి, నిరెంటి వెంకటేష్, గిరిబాబు, బాలస్వామి, దాసరి రాము, సంజీవ్, మన్యం, లక్ష్మీనారాయణ, పురుషోత్తం పాల్గొన్నారు.

## వాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



కొత్తకోటలో వాల్మీకులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కొత్తకోట రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లాలో వాల్మీకులు ఎక్కువగా ఉండటంతో వాల్మీకీ బోయలకు అసెంబ్లీ సీటు కేటాయించాని వాల్మీకీ నాయకులు ఉమ్మల్లరాములు, భీమన్ననాయుడు, రమణలు రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు. వాల్మీకి బోయలకు అసెంబ్లీ సీటు కేటాయించాలని కోరుతూ ఆదివారం గద్వాల నుంచి వాల్మీకీ బోయలు 200లకు పైగా వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. వాల్మీకి సంఘం నాయకులకు వాల్మీకి బోయ ఐక్య కార్యచరణ కమిటీ రాష్ట్ర సభ్యులు భీమన్ననాయుడు ఆధ్వర్యంలో కొత్తకోటలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు వాల్మీకి నాయకులు మాట్లాడుతూ 2014, 2018 ఎన్నికల్లో వాల్మీకి బోయలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను విస్మరించారని, పార్టీలకు అతీతంగా ఏ పార్టీ నుంచి వాల్మీకులను అసెంబ్లీ టికెట్ ఇచ్చిన భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మల్ల రాములు, బీజేపీ నాయకురాలు బాల మణెమ్మ, రమణ, ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, ఇరుపునూరి రాజునాయుడు, గోవర్ధన్ నాయుడు ఉన్నారు.

## కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?



కంపచెట్లతో మూసుకుపోయిన డీ-27 కాల్వ

శాంతినగర్: ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలు అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు, చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. ఇప్పటికే నీళ్లు వదలాల్సి ఉండగా, ఎగువన ఉన్న టీబీ డ్యాంలో నీటి నిల్వలు లేక కెనాల్ వట్టిపోయింది. తుఫాన్ల ప్రభావంతో టీబీ డ్యాం నుంచి కెనాల్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం డిస్ట్రిబ్యూటరీ కాల్వలు అధ్వానంగా ఉండడంతో నీళ్లు వదిలితే సాఫీగా ముందుకు సాగే పరిస్థితి లేదు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వలోని షిల్ట్‌ను ఇటీవల తొలగించారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలను పట్టించుకోవడంలేదు. దీంతో ప్రధాన కాల్వ నుంచి నీటిని వదిలినా డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్డీఎస్ అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాల్వలను శుభ్రం చేయించి నీటి పారుదలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

### వర్షం.. హర్షం

ఉండవెల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారు జామున మోస్తారు వర్షం కురిసింది. పంటలు ఎండుతున్న క్రమంలో వర్షం కురువడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షంతో మిరప, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పచ్చదనం సంతరించుకున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు రైతులు పొగాకు సాగుకు సిద్ధమయ్యారు.

ధరూరు: మండలంలో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతోపాటు మన్నాపురం, జాంపల్లి తదితర గ్రామాల్లో ఉదయం 6నుంచి 7గంటల వరకు కురిసిన వర్షం పంటలకు ఊరటనిచ్చింది. ఎండుముఖం పట్టిన మెట్ట పంటలకు జీవం పోసినట్లయింది.



### బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని శ్రీనివాసపూర్‌కు చెందిన గుజ్జుల కుక్కన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త ప్రమోద్‌కుమార్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

### డివైడర్‌ను ఢీకొన్న తుఫాన్



అమరచింత: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రహదారిపై డివైడర్‌ను తుఫాన్ ఢీ కొట్టిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని మల్లకల్ నుంచి నారాయణపేట జిల్లా కోటకొండకు తుఫాన్‌లో శుభకార్యానికి వెళ్తున్నారు. అమరచింత పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్‌ను తుఫాన్ ఢీ కొట్టడంతో వాహనం ముందు చక్రంతో పాటు అద్దాలు ధ్వంసమయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి వారిని రక్షించారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారితో పాటు డ్రైవర్ సైతం మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

### ఆర్థికసాయం

అడ్డాకుల: బలీదుపల్లికి చెందిన శ్రీను అనారోగ్యానికి గురై మరణించడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేలను పంపడంతో వాటిని బాధిత కుటుంబానికి అందజేశారు. శ్రీధర్‌యాదవ్, నర్సింహ, రాములు తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మున్సిపల్ వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్ సుధాకర్ రెండు రోజుల క్రితం హార్ట్‌ఎటాక్‌తో మృతిచెందగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అదేవిధంగా కప్పెటకి చెందిన జాఫర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల నగదు సాయం అందించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ముడా డైరెక్టర్లు ఉన్నారు.

### గణిత విజ్ఞాన మేళా



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బండమీదిపల్లిలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో ఆదివారం గణిత విజ్ఞాన సాంస్కృతిక మేళా నిర్వహించారు. సరస్వతి విద్యా పీఠం పాలమూరు విభాగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు గణితంపై పట్టుసాధించి విషయ పరిజ్ఞానాన్ని అలవరుచుకోవాలన్నారు. విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంతరెడ్డి, వీరన్నపేట పాఠశాల అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, పాఠశాల కార్యదర్శి కె.శ్రీనివాసులు, మేకల సుదర్శన్, రాజమల్లేష్, వేణుగోపాల్, బాల్‌రాజు, శివశంకర్, యుగేందర్‌రెడ్డి, కందూరు బాల్‌రాజు, చంద్రశేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు పూర్తి చేయాలి



ఆత్మకూర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి ఓటరు నమోదును పరిశీలించారు. 2023 అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చాణిక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

పాన్‌గల్: 2023 అక్టోబర్ 23వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీటీ చక్రపాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదులో 134 దరఖాస్తులు, మార్పులు, చేర్పుల కోసం 28 దరఖాస్తులు కలిపి మొత్తం 162 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన తెలుగు రాముడుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.45వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు ఆదివారం పంపిణీ చేశారు. సీఎం సహాయనిధితో పేదలకు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారన్నారు. చెక్కు మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, పరమేష్, కుర్మయ్య, పవన్, రామకృష్ణ, మౌలాలి, విష్ణుమూర్తి, వినోద్‌గౌడు, గురురాజాచారి, పవన్‌చారి, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

## గడప గడపకు కేంద్ర పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్

పాన్‌గల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు వివరించాలని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ అన్వేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జోనల్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎల్లేని సుధాకర్‌రావు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జగన్‌గుప్తా, శ్రీకాంత్, వెంకటేష్‌యాదవ్, శివరామ్ ఉన్నారు.

## కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల దగ్గర గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే దశలవారీగా సమ్మె చేసేందుకు వెనకాడమన్నారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పానుగంటి శ్రీనువాసులు, కోషాధికారిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా దాసు, పుష్ప, నర్సింహులు, సహాయ కార్యదర్శులుగా శ్రీనువాసులు, విజయలక్ష్మి, కొండ బాలయ్య, బిక్షపతి, గంగాదేవితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వబడులు



స్క్రీన్‌పై చూపిస్తూ బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

- పొన్నకల్ పాఠశాలలో కార్పొరేట్ వసతులు
- 8,9,10 తరగతులకు స్మార్ట్ క్లాస్‌లు
- మన ఊరు– మన బడితో మెరుగైన సౌకర్యాలు



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సర్కారు బడిని తీర్చిదిద్దారు. అధునాతన సౌకార్యలతో విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో కార్పొరేట్ పాఠశాలల్లో కనిపించే వసతులు ఇక్కడ ఏర్పాటయ్యాయి. 2022 మార్చి 9న ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మొదటి విడతలో పొన్నకల్ పాఠశాలలను ఎంపిక చేయించడంతో మంజూరైన రూ.1.10కోట్లతో ప్రాథమిక, హైస్కూల్ బడుల రూపురేఖలే మారిపోయాయి. రెండు బడులను సుందరంగా తీర్చిదిద్దారు.

### స్మార్ట్ తరగతులు..!

పొన్నకల్ ప్రాథమిక పాఠశాలలో 112 మంది, హైస్కూల్‌లో 157 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో హైస్కూల్‌కు 9 తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మన ఊరు మన బడి కింద స్మార్ట్‌క్లాస్‌ల కోసం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) పేరిట బహుళ ప్రయోజనాలతో కూడిన 75 అంగులాల స్క్రీన్లను ఏర్పాటు చేశారు. బ్లాక్ బోర్డుల స్థానంలో గ్రీన్‌చాక్ బోర్డులను అమర్చారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను తెరపై ప్రదర్శిస్తూ గ్రీన్‌చాక్ బోర్డుపై రాసి వివరించేటటువంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పెన్‌డ్రైవ్‌లో పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేసుకుని అవసరమైనప్పుడు వాటిని వాడుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోవడానికి కార్పొరేట్ స్థాయి ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు.

అదేవిధంగా పాఠశాల ఆవరణలోనే ఓ పెద్ద గదిలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల ఆర్థిక సాయంతో గ్రంథాలయంలో కావాల్సిన వసతులు, పుస్తకాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మన ఊరు– మన బడి కింద సౌకర్యవంతమైన డైనింగ్ హాలు, నూతన కిచెన్ షెడ్‌లతో పాటు, టాయ్‌లెట్స్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వసతులను ప్రారంభించారు. కాగా ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కల్పన సహకారంతో స్థానిక రెన్యూ పవర్ సోలార్ విద్యుత్ సంస్థ ద్వారా పాఠశాలకు ఉచితంగా సోలార్ పలకలు, నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయించారు.

### మెరుగైన బోధన



పాఠశాలకు కావాల్సిన అన్ని రకాల వసతులను సర్కారు ఏర్పాటు చేయించింది. స్మార్ట్ తరగతులతో పాటు గ్రంథాలయాన్ని అందుబాటులో ఉంచాం. మెరుగైన విద్యా బోధన విద్యార్థులకు అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలి

–ఫయాజ్, హెచ్‌ఎం, పొన్నకల్

### స్మార్ట్ తరగతులతో మేలు



మా పాఠశాలలో మన ఊరు– మన బడి ద్వారా 8, 9, 10 తరగతులకు స్మార్ట్ తరగతులను ఏర్పాటు చేశారు. పెద్ద స్క్రీన్‌పై వీడియోలను చూపిస్తూ డిజిటల్ క్లాసులను నిర్వహిస్తున్నారు. దీనివల్ల సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయి.

–శివాని, 9వ తరగతి

### సౌకర్యాలు బాగున్నాయి



మా బడిలో గత విద్యా సంవత్సరంలోనే అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. డిజిటల్ తరగతులు ఏర్పాటు చేసి డైనింగ్ హాలు, కిచెన్ షెడ్ నిర్మించారు. మరుగుదొడ్ల వసతిని మెరుగు పర్చారు. కార్పొరేట్ బడిలా తీర్చిదిద్దడం చాలా బాగుంది.

–వర్షిత్, 10వ తరగతి